క్లుప్తంగా

డివిజన్‌లో 327 మి.మీ. వర్షపాతం

నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో శనివారం రాత్రి 327 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఉప గణాంకాధికారి ప్రసాద్ తెలిపారు. వీరులపాడు మండలంలో అత్యధికంగా 93.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా, నందిగామ మండలంలో 42.6 మి.మీ, కంచికచర్లలో 78మి.మీ, చందర్లపాడులో 43.8మి.మీ, జగ్గయ్యపేటలో 15.2మి.మీ, పెనుగంచిప్రోలులో 8.8మి.మీ, వత్సవాయి మండలంలో 45.2మి.మీ వర్షం కురిసినట్లు ఆయన వివరించారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వీరులపాడు: రౌడీషీటర్లు తీరు మార్చుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్ఐ అనిల్ సూచించారు. వీరులపాడు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, ఘర్షణలు, వివాదాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేర చరిత్రను మానుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిపై ఉన్న రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. అనంతరం ఎటువంటి నేరాలకు పాల్పడమంటూ రౌడీషీటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు లోక్ కళ్యాణ మేళా

నందిగామ రూరల్: వీధి వ్యాపారులకు రుణ సౌకర్యం, డిజిటల్ పేమెంట్స్‌పై శిక్షణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు లోక్ కళ్యాణమేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ లోవరాజు ఆదివారం తెలిపారు. వీధి వ్యాపారులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురజాడ రచనలు అజరామరం

అభ్యుదయ రచయితల సంఘం నివాళి



తిరువూరు: అభ్యుదయ కవి గురజాడ అప్పారావు రచనలు ఎన్ని తరాలైనా అజరామరంగా నిలుస్తాయని అభ్యుదయ రచయితల సంఘ జిల్లా మాజీ కార్యదర్శి పసుపులేటి వెంకయ్య అన్నారు. తిరువూరు గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం గురజాడ జయంతి కార్యక్రమం తిరువూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకయ్య మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులులోని సంస్కరణ భావాలు, గిడుగు రామ్మూర్తి వ్యావహారిక భాషా శైలి మేళవించి గురజాడ సాహితీరంగంలో నూతన అధ్యాయానికి పునాది వేశారన్నారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉయ్యూరు అనసూయ, రేపాక రఘునందన్, ప్రముఖ న్యాయవాది తాళ్లూరి రామారావు, జన విజ్ఞాన వేదిక సభ్యులు కె. పాపారావు, తిరువూరు రచయితల సంఘ కార్యదర్శులు భరతకుమారి, రజని, వాణి, రంగారావు తదితరులు గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాడ రాసిన కన్యాశుల్కం, పూర్ణమ్మ కథ, ముత్యాలసరాలు వంటి రచనలు సామాజిక సమస్యలే ప్రధానాంశాలుగా ఖ్యాతి గడించాయన్నారు. ఇటీవల మరణించిన రచయితల సంఘ సభ్యుడు నారాయణపురపు కుమార్‌కు సభ్యులు నివాళులర్పించారు.

నేత్రపర్వంగా సంగీత నృత్య సమ్మేళనం

విజయవాడకల్చరల్: శ్రీవాగ్దేవీ వాయిద్య సంగీత, నృత్య సంస్కృతీ సంస్థ ఆధ్వర్యాన లబ్బీపేటలోని శ్రీశారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన సంగీత నృత్య సమ్మేళనం నేత్రపర్వంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, నృత్య కళాకారులు, వాయిద్య కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా ఆకట్టుకున్నారు. కూచిపూడి, భరతనాట్యం, మోహినీ అట్టం, జానపద అంశాలను ప్రదర్శించారు. వాయిద్య కళాకారుల బృందం నాటరాగంలో ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన మహాగణపతిం, త్యాగరాజస్వామి కీర్తన శ్రీరాగంలోని ఎందరో మహానుభావులు, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుని కీర్తన చూడరమ్మ సతులార కీర్తనలను పలికించారు. శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వాహకులు డాక్టర్ రామ్మోహనరావు, సంస్థ నిర్వాహకుడు బి.నాగేంద్ర యాదవ్, తిరుమల తిరుపతి దేవస్థాన సంగీత కళాశాల అధ్యాపకుడు చంద్రశేఖర్ నృత్యోత్సవంలో పాల్గొన్న నాట్యాచార్యులను, చిన్నారులను సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

నందిగామరూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆయా గ్రామాలలోని ఆలయాలను భక్తులు సర్వాంగసుందరంగా ముస్తాబు చేస్తున్నారు. అంబారుపేట సత్యమ్మ అమ్మవారు, దాములూరు కూడలిలోని సంగమేశ్వరస్వామి, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, లింగాలపాడులోని లక్ష్మీ పేరంటాళ్లు, నందిగామలోని రామలింగేశ్వర స్వామి, వాసవీ కన్యకా పరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాలను అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

పట్టణంలోని శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ఈనెల 22న రజిత కవచాలంకారం, 23న బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించనున్నట్లు ఈవో సురేష్ తెలిపారు. 24న గాయత్రీదేవి, 25న అన్నపూర్ణా దేవి, 26న శ్రీమహాలక్ష్మీ దేవి, 27న లలితా త్రిపురసుందరీ, 28న కాత్యాయినిదేవి, 29న మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు ఒకటిన మహిషాసురమర్దిని, 2వతేదీన రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వివరించారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో..

వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో 22న అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా, 23న గాయత్రీ దేవి, 24న అన్నాపూర్ణాదేవి, 25న కాత్యాయినిదేవి, 26న శ్రీమహాలక్ష్మీ దేవి, 27న లలితా త్రిపురసుందరీ దేవి, 28న మహాచండీ దేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు ఒకటిన మహిషాసురమర్దిని, రెండోతేదీన రాజరాజేశ్వరీదేవిగా అలంకరించనున్నారు. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యే పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



విద్యుద్దీపకాంతుల్లో అంబారుపేట సత్యమ్మ ఆలయం

కంచికచర్లలో..

కంచికచర్ల : స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుంచి విజయదశమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కాకాని వెంకట పవన్‌కుమార్(బాబి) ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని శ్రీ బ్రహ్మచారిణి దేవి, 23న శ్రీశైల పుత్రీ దేవి, 24న శ్రీ మంగళగౌరీదేవి, 25న శ్రీ సిద్ధిధాత్రి దేవి, 26న శ్రీకాత్యాయనిదేవి, 27న శ్రీస్కందమాత దేవి, 28న శ్రీకూష్మాండదేవి, 29న సరస్వతీదేవి, 30న చంద్రఘంటదేవి, అక్టోబర్1న శ్రీకాళరాత్రి దేవి, 2న శ్రీరాజరాజేశ్వరిదేవిగా అలంకరించి పూజలు చేయనున్నట్లు వివరించారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: నూటొక్క దేవాలయాల పట్టణంగా ప్రసిద్ధికెక్కిన జగ్గయ్యపేట దసరా వేడుకలకు ముస్తాబైంది. పట్టణంలోని ఆయా ఆలయాల్లో దసరా వేడుకల నిర్వహణకు అధికారులు, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల నేతృత్వంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.



దసరా ఉత్సవాల కోసం పేట వెండి దేవాలయం వద్ద ముస్తాబు చేసిన మండపం



తిరుమలగిరి ఆలయంలో పూజలు అందుకోనున్న అమ్మవారి విగ్రహం

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు..

జగ్గయ్యపేట: దసరా వేడుకలను పురస్కరించుకుని తిరుమలగిరి గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలోని మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. బలుసుపాడు గురుధాం క్షేత్రంలో దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.



మండపాల్లో ఏర్పాటు చేయనున్న అమ్మవార్ల విగ్రహాలు



పెనుగంచిప్రోలు తూర్పుబజారులో ఏర్పాటు చేసిన శరన్నవరాత్రుల మండపం

నేడు కొలువదీరనున్న అమ్మవార్లు

పెనుగంచిప్రోలు: దసరా పండుగ సందర్భంగా అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాతలకు మండపాలు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి అక్టోబర్ 2వరకు అమ్మవారిని వివిధ అవతారాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించనున్నారు. ఈ ఉత్సవాల కోసం భక్తులు వివిధ రూపాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాలను కొనుగోలు చేసి మండపాల వద్దకు చేర్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమివ్వనుండగా, భక్తులు ప్రతిరోజూ కుంకుమపూజతోపాటు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అక్టోబర్ రెండోతేదీ విజయదశమి రోజున శమీపూజ, ఆయుధ పూజ నిర్వహించనున్నట్లు మండపాల నిర్వాహకులు తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సిగ్గుచేటు

సీపీఎం నేత బాబూరావు

నందిగామటౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేస్తామనడం సిగ్గుచేటని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. పట్టణంలోని బాబుజగ్జీవన్‌రామ్ భవనంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన వైద్యకళాశాలల ప్రైవేటీకరణను సీపీఎం ఆధ్వర్యంలో అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అరకొరగా అమలు చేస్తూ సూపర్ హిట్ అంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నిరుపేదలకు సెంటు స్థలం ఇవ్వలేని ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌తో పేరుతో పెద్దఎత్తున భూసేకరణ చేసి పెద్దపెద్ద కంపెనీలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన అనాలోచిత నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు డీవీ కృష్ణ, కోట కళ్యాణ్, శ్రీనివాస్, కటారపు గోపాల్, సయ్యద్ ఖాశీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత బాబురావు, నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

నందిగామటౌన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని మూకుమ్మడిగా ఖండించటంతో పాటు అడ్డుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు కోరారు. పాలస్తీనాపై జరుగుతున్న మారణ ఖాండను నిరసిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి, ప్రపంచ దేశాలు కలగజేసుకుని మారణహోమాన్ని ఆపాలన్నారు. ఇజ్రాయిల్ కనికరం లేకుండా చిన్నపిల్లలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, పేద ప్రజలు, జర్నలిస్టులపై సైతం దాడులకు తెగబడుతోందన్నారు. ట్రంప్ వత్తాసుతో ఇజ్రాయిల్ చెలరేగుతుందని, భారత ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు అండగా నిలబడటం సిగ్గుచేటని విమర్శించారు. కూటమి ప్రభుత్వాన్ని డబుల్, త్రిబుల్ ఇంజన్ సర్కారు అని గొప్పలు చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు అమెరికాలు దేశ విద్యార్థులు, రైతుల ఇబ్బందులపై కేంద్రప్రభుత్వంపై ఎందుకు వత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు డి.వి.కృష్ణ, శ్రీనివాస్, కోట కళ్యాణ్, ఆంజనేయులు, కటారపు గోపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



నందిగామలో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

మూలనపడిన చెత్త సేకరణ వాహనాలు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



జయంతిపురంలో మూలనపడిన చెత్త సేకరణకు వినియోగించే బ్యాటరీ ఆటో

జగ్గయ్యపేట: మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో చెత్త సేకరణకు వినియోగించే బ్యాటరీ ఆటోలు మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు వీటి మరమ్మతులను మాత్రం పట్టించుకోవడం లేదు. ధర్మవరప్పాడుతండ, గండ్రాయి, షేర్‌మహ్మద్‌పేట, జయంతిపురం, కెఅగ్రహారం, బూదవాడ, చిల్లకల్లు గ్రామాల్లో చెత్త సేకరణకు వినియోగించే బ్యాటరీ వాహనాలు మరమ్మతులకు గురికావడంతో చెత్త సేకరణకు పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందిపడుతున్నారు. బ్యాటరీ రిక్షాల స్థానంలో సాధారణ రిక్షాలను వినియోగిస్తూ వాటిని లాగలేక అవస్థలుపడుతున్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రతినెలా మూడో శనివారం గ్రామాల్లో చెత్త సేకరణపై సమావేశాలు, పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీలు చేస్తున్నా చెత్త సేకరించే వాహనాల మరమ్మతుల అంశాన్ని అధికారులు పట్టించుకోకపోతుండటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆయా పంచాయతీలకు ఆదాయం ఉన్నప్పటికీ ఈ బ్యాటరీ వాహనాల మరమ్మతులు చేయించే విషయంలో మాత్రం పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. ఇకనైనా మూలనపడిన బ్యాటరీ ఆటోలను వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఆయా పంచాయతీ కార్యదర్శులపై ఉంది. ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గండ్రాయిలో మూలనపడిన వాహనాలు



ధర్మవరప్పాడుతండలో మరమ్మతులకు గురైన బ్యాటరీ ఆటో



షేర్‌మహ్మద్‌పేటలో మూలనపడిన బ్యాటరీ వాహనాలు

వైభవంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం



పేట పెద్ద రామాలయం వద్ద బతుకమ్మలతో మహిళలు



వెండి దేవాలయం వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



పెనుగంచిప్రోలు: లింగగూడెంలో బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం సాయంత్రం బతుకమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక పెద్ద రామాలయంలో జరిగిన వేడుకల్లో రంగు రంగుల వివిధరకాల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. బతుకమ్మ గేయాలు ఆలపిస్తూ నృత్యాలు, కోలాటాలతో అలరించారు. బతుకమ్మ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కొప్పు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చెక్కా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెండి దేవాలయం వద్ద ..

పట్టణంలో అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం వద్ద మహిళా కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మ ఆడిపాడారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మండలంలో బతుకమ్మ సంబరాలు ఆదివారం ఎంగిలి బతుకమ్మలతో వైభవంగా ప్రారంభయ్యాయి. పెనుగంచిప్రోలులోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, లింగగూడెం గ్రామంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలను గౌరవిస్తూ బతుకమ్మ సంబరాల్లో భాగంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆడిపాడారు.

750 మందికి ఉచిత వైద్యపరీక్షలు

నందిగామరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొణతమాత్మకూరు సర్పంచ్ మేడా కోటేశ్వరరావు, సమతా క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు కెజెడీఎస్ కుమార్ సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గ్రామ కమిటీ, సమతా క్లబ్ సంయుక్తాధ్వర్యంలో కొణతమాత్మకూరులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. వైద్యులు మొత్తం 200మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతోనే ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు శివకుమార్, క్లబ్ సభ్యులు కోటా రవీంద్రనాథ్, తాళ్లూరి రజనీకాంత్, హనుమంతరావు, మేడా రాధాకృష్ణ, కొత్తపల్లి సుందర్, గోపి, సురేష్, గోపాలరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనాయపాలెంలో..

కోనాయపాలెం(నందిగామటౌన్): చందర్లపాడు మండలం కోనాయపాలెంలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బంది మొత్తం 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వాసుదేవరావు, వైద్యులు పాల్గొన్నారు.



కొణతమాత్మకూరులో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్‌బాబు

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: స్థానిక చెవిటికల్లు రోడ్డు సమీపంలోని ఆల్ఫా కాంప్లెక్స్‌లో కారుణ్య ఎమర్జన్సీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐ చవాన్ ప్రారంభించగా, వైద్యుడు ఎం.సురేష్‌బాబు ప్రజలకు 2డి ఎకో, ఈసీజీ గుండె సంబంధింత పరీక్షలు చేశారు. అంతేకాకుండా బీపీ, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశారు. మొత్తం 300మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రామినేని శ్రీకాంత్, డాక్టర్ కోలా విజయశేఖర్, డాక్టర్ బి.కృపాలిన్, డాక్టర్ వంశీ, కీర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: మోహన కృష్ణ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సీనియర్ గాయకుడు ఆశయ్య పర్యవేక్షణలో గాయనీ గాయకులు షేక్ రసూల్‌బాబు, పి.రవికుమార్, లక్ష్మణ్ నాయక్, వి.రాంజీనాయక్, రూపశ్రీ, సుమ, సుకన్య, దీప్తిలు తెలుగు సినీ గీతాలను మధురంగా ఆలపించారు. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గాయకుడు ఆశయ్యను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, బి.వి. వీరభద్రరావు, చావా నరసింహారావు, బి.లక్ష్మీబాయి, బి.లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.